

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## చైతన్యం

**బెల్ మోగింది.** వాహిని టైం చూసింది. సాయంత్రం ఆరు. నిట్టూర్చి లేచి వెళ్ళి తలుపు తీసింది. స్వరూప్ లోపలికి వచ్చి తలుపు మూసి గడియ పెట్టాడు. వాహిని మంచి నీళ్ళు ఇచ్చింది. తాగి గ్లాస్ ఆమె చేతికిచ్చాడు. వాహిని దాన్ని సింక్‌లో తొలిచి స్టాండ్‌లో ఉంచింది.

స్వరూప్ బెడ్రూంలోకి వెళ్ళి డ్రెస్ మార్చుకుని వచ్చి టి.వి ముందు కూర్చున్నాడు. ఎనిమిది గంటలదాకా ఛానల్స్ మారుస్తూ టి.వి చూసాడు. ఎనిమిది గంటలకి వాహిని భోజనం వడ్డించింది. ఇద్దరూ నిశ్శబ్దంగా తిన్నారు. స్వరూప్ మళ్ళీ టివి ముందు కూర్చున్నాడు. వాహిని టేబుల్ సర్ది పాలుతోడు పెట్టి బాల్కనీలోకి వెళ్ళింది. నాలుగంతస్థుల కింద కనపడే రోడ్డు వంక చూస్తూ కూర్చుంది. కిందంతా సందడిగా ఉంది. ఎదురుగా ఉన్న పార్కు బయట పూలు, పళ్ళు, సమోసాలు, ఛాట్స్, మిరపకాయ బజ్జీలు అమ్మేవాళ్ళు సర్దుకుంటున్నారు. జనాలు జంటలుగా, వంటరిగా కార్లలో, బైక్స్ మీద ఇళ్ళకి వెళ్తున్నారు. అపార్ట్‌మెంట్ గేటులోపల పిల్లలు ఆడుకుంటున్నారు.

తమలో తప్ప ప్రపంచమంతా చైతన్యంతో నిండివుంది అనుకుంది వాహిని. ఎందుకిలా? అని అనేకసార్లు ప్రశ్నించుకున్నా ఆమెకి ఎప్పటిలా తట్టలేదు.

తొమ్మిదిన్నరకి ఈ టి.వి న్యూస్ అయిపోగానే స్వరూప్ లేచి టి.వి, లైట్, ఫాన్ ఆర్పి బెడ్రూంలోకి వచ్చాడు. మంచం మీద పడుకుని సెల్ ఫోన్‌లో మెసేజ్‌లు, ఫేస్‌బుక్ చూసుకున్నాడు. పదిగంటలకల్లా అతను ప్రశాంతమైన గాఢనిద్రలోకి జారుకున్నాడు.

వాహిని బాల్కనీ తలుపు మూసి వచ్చి అతని పక్కనే పడుకుంది. ఓ అరగంట పోరాటం తర్వాత ఆమెకి నిద్రపట్టింది.

మర్నాడు ఆరున్నరకల్లా వాహిని నిద్రలేచి ఇంటిపనిలో నిమగ్నమైంది. స్వరూప్ ఏడున్నరకి లేచాడు. బాత్రూంలోకి వెళ్ళి, అరగంటలో బ్రషింగ్, షేవింగ్, స్నానం ఒకేసారి ముగించుకుని వచ్చాడు. పేపర్ చదువుతూ టిఫిన్ తిన్నాడు. ఎనిమిదిన్నరకల్లా డ్రెస్ చేసుకుని బయటకి వెళ్ళి తలుపు మూసాడు.

వాహిని నిట్టూర్చి మిగిలిన పనిపూర్తి చేయసాగింది. స్వరూప్ లంచ్ ఆఫీస్‌లోనే తింటాడు. బాక్స్ తీసుకెళ్ళడం ఇష్టం ఉండదు. తనవరకు వండుకుని పదిన్నరకల్లా పనులన్నీ ముగించి బాల్కనీలోకి వచ్చింది. కింద మళ్ళీ చైతన్యం వెల్లివిరుస్తోంది. ఆమెకి అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి.

పెళ్ళయిన ఐదేళ్ళకే ఈ నిర్లిప్తత ఏంటి? భర్తల బైక్స్ మీద వెళ్ళే భార్యలు భుజం మీద గడ్డం ఆనించి ఏదో చెప్తూనే ఉంటారు. ఏం చెప్తారు? ఏం కబుర్లు ఉంటాయి? అవి తమ మధ్య ఎందుకు లేవు? తామిద్దరి మధ్య ఎందుకీ నిశ్శబ్దం?

పిల్లలున్నా బావుండేది అనిపించింది వాహినికి. మాట్లాడడానికి ఏదో ఒకటి ఉండేది. వాళ్ళ చిలిపి చేష్టల్లో, రోగాల్లో ఏదో ఒక టాపిక్. ఎందుకు పుట్టలేదో తెలీదు. తామిద్దరూ దాని గురించి అనుకోలేదు. ఆరాటపడలేదు. డాక్టర్లని కలవలేదు. టైం వచ్చినప్పుడు వాళ్ళే పుడతార్లే అనే నిర్లిప్తత.

ఒక రొటీన్‌కి అలవాటయ్యే దాకా ఇద్దరిమధ్యా చిన్న చిన్న మాటలు ఉండేవి. ఆ తర్వాత అవీలేవు. 'నెయ్యిగిన్నె ఇవ్వు' 'ఇవాళ పేపర్ రాలేదే? నిన్న సెలవా?' లాంటి మాటలు తప్ప తమ మధ్య కబుర్లు లేవు. వీకెండ్స్‌లో ఉదయం వంట, మధ్యాహ్నం స్నాక్స్ తప్ప పెద్ద తేడా ఉండదు. టివి లేచిన మొదలు పడుకునే దాకా మోగుతూనే ఉంటుంది.

సినిమాలు లేవు. షికార్లు లేవు. షాపింగ్ లేదు. కావలసిన వస్తువుల లిస్ట్ రాసిస్తే శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చేప్పుడు తెస్తాడు అంతే. ఇద్దరికీ స్నేహితులు లేరు. తల్లితో ఎంతసేపు మాట్లాడుతుంది? రోజూ ఏముంటాయి కబుర్లు? స్వరూప్ ఆఫీస్‌కి వెళ్తాడు కాబట్టి అతడికి పగలంతా కాలక్షేపం ఉంటుంది. తను టి.వి చూడదు. పుస్తకాలు చదివే అలవాటు లేదు. వాహినిలో అశాంతి.

బెల్ మోగింది. వాహిని తలుపు తెరిచింది. స్వరూప్ లోపలకి వచ్చాడు. అంతా రొటీన్. భోజనం అయ్యాక వంటగది సర్ది వాహిని బాల్కనీలోకి వెళ్ళి కింది సంరంభాన్ని చూస్తోంది. టివీలో వార్తలు వినిపిస్తున్నాయి. అకస్మాత్తుగా వాహినికి రేపటి బ్రేక్‌ఫాస్ట్‌కి పప్పు నానపెట్టలేదని గుర్తొచ్చింది.

వంటగదిలోకి వెళ్తూ ఓ విడ్డూరాన్ని గమనించింది. తమ ఇంటి తలుపు తెరిచి వుంది. అలవాటుగా స్వరూప్ తలుపు మూసి గడియ వేసాడు. మరి మళ్ళీ ఎందుకు తెరిచాడు?

పప్పు నానపెట్టి మళ్ళీ బాల్కనీలోకి వెళ్తూ మరో వింతని గమనించింది. దీక్షగా వార్తలు చూసే స్వరూప్ సెల్‌ఫోన్‌లోంచి ఎవరితోనో ఛాట్ చేస్తున్నాడు.

వాహిని మౌనంగా బాల్కనీలోని కుర్చీలో కూర్చుంది. ఆమె ఇష్టంగా కుండీలో పెంచిన జాజి మొక్క గ్రిల్ అంతా పాకింది. తెల్లని నక్షత్రాల్లా జాజిపూలు అంతటా వ్యాపించి సువాసనలని వెదజల్లుతున్నాయి. రెండు పూలు తెంపి తలలో తురుముకుంది. బయటి తలుపు మూసిన శబ్దమైంది. ఆమె లేచి పడకగదిలోకి వెళ్ళింది.

స్వరూప్ ఉత్సాహంగా లోపలకి వచ్చాడు. తన పక్కన పడుకున్న వాహినిని గాఢంగా చుంబించాడు. పావుగంట తర్వాత వాహిని తృప్తిగా నిద్రపోయింది. స్వరూప్ పక్కకి తిరిగి ఫోన్‌లో మెసేజ్‌లు చేస్తూనే ఉన్నాడు. రెండున్నరకి బాత్‌రూంకి వెళ్ళడానికి లేచిన వాహిని అతనింకా మెలుకువగా ఉండటం చూసి ఆశ్చర్యపోయింది.

"నిద్రపట్టడం లేదా?" మృదువుగా అడిగింది.

"అవును. పడుకుంటా" అస్పష్టంగా గొణిగి ఫోన్‌ని దిండుకిందకి తోసాడు.

మర్నాడు వాహిని ఎప్పట్లా ఆరున్నరకి లేచింది. పప్పురుబ్బి గారెలు వండింది. అల్లప్పచ్చడి చేసింది. ఎనిమిదైనా స్వరూప్ లేవలేదు. లేపితే తిడతాడో, లేపకపోతే తిడతాడో ఆమెకి అర్థంకాలేదు. కొంచెం తటపటాయించి ఎనిమిదిన్నరకి లేపింది.

"ఎనిమిదిన్నరైంది."

"మైగాడ్!" స్వరూప్ చటుక్కున లేచి బాత్‌రూంలోకి పరిగెత్తాడు. పది సెకండ్ల తర్వాత వచ్చి దిండు కింది ఫోన్‌ని తీసుకుని మళ్ళీ బాత్‌రూంలోకి వెళ్ళాడు.

"ఇవ్వాళేం తినను. లేటైపోయింది" డ్రెస్ చేసుకుని వచ్చి చెప్పాడు.

"గారెలు చేసాను" గొణిగింది.

"ఓకే. ఓకే. రెండు తింటాను" హడావిడిగా తిని వెళ్ళిపోయాడు.

వాహినికి అంతా విచిత్రంగా ఉంది. తన జీవితంలోని మొనాటనీ గురించి తను బాధపడిన రోజే ఈ మార్పులన్నీ జరగడం ఆమెకి నమ్మశక్యంగా లేదు. ముఖ్యంగా స్వరూప్ తనని తాకి నెలలైంది. అలాంటిది రాత్రి ఎంత అనురాగంగా ఉన్నాడు. ఇదివరకటిలా మొక్కుబడి కాదు. నిజంగా ఇష్టంగా ఉన్నాడు.

వాహినికి ఆనందంతో కళ్ళల్లోంచి నీళ్ళొచ్చాయి.

ఆ సాయంత్రం చాలా ఉత్సాహంగా పనులన్నీ పూర్తిచేసి స్వరూప్ వచ్చేలోగా స్నానం చేసి తెల్లటి కాటన్ చీర కట్టుకుంది. సన్నజాజి మొగ్గలని వెదికి కోసి, బెడ్రూం వైపున్న మొగ్గలని వదిలేసింది. పూలని మాలకట్టి తల్లో పెట్టుకుని, అద్దం ముందు కొన్ని నిమిషాలు అదనంగా నిలబడి తన ముఖాన్ని తృప్తిగా చూసుకుంది.

ఆరుకి ఐదునిమిషాల ముందే బెల్ మోగింది. వెళ్ళి తలుపు తీసింది.

"డార్లింగ్!" స్వరూప్ ఆమెని గట్టిగా పట్టుకుని చుంబించాడు.

ఎదురింటి తలుపు తీసేవుంది. అది గమనించి వాహిని సిగ్గుపడింది.

స్వరూప్ పడకగదిలోకి వెళ్ళి దుస్తులు మార్చుకుని వచ్చాడు.

"మోహ్నీ పేషెన్స్ స్టోన్" అనే ఆఫ్ఘన్ మూవీ బావుందిట. చూద్దాం. స్వరూప్ హుషారుగా చెప్పాడు.

పెళ్ళయిన కొత్తల్లో స్వరూప్ వాహిని పేరుని మోహినిగా మార్చి పిలిచేవాడు. మళ్ళీ ఇన్నేళ్ళకి.

భోజనం అవగానే ఇద్దరూ యూ ట్యూబ్‌లో ఆ సినిమా చూసారు. భర్తతో చూడడం వల్లో, లేక కథ బావుండటం వల్లో సినిమా వాహినికి బాగా నచ్చింది.

"సరే. నేను కొద్దిసేపు వార్తలు చూసివస్తాను. నువ్వెళ్ళి పడుకో" స్వరూప్ ఆమె తల్లోని పూలని ఆఘ్రాణించి, చెంపమీద చుంబించి చెప్పాడు.

వాహిని బాల్కనీలోకి వెళ్ళలేదు. పడకగదిలోని మంచం మీద పడుకుంది. సినిమాలోని భర్త గురించి రెండు నిమిషాలు ఆలోచించింది. మూడో నిమిషంలో నిద్రపోయింది.

"రాత్రి మీరు ఎప్పుడు వచ్చి పడుకున్నారో గుర్తులేదు. చాలామొద్దు నిద్రపోయాను" మర్నాడు సిగ్గుగా చెప్పింది.

"మరేం పర్లేదు బుజ్జీ. మనకింకా చాలా రాత్రులున్నాయి." స్వరూప్ కొంటెగా నవ్వాడు.

ఆ తర్వాత పదిరోజులు వాహిని జీవితంలో ఫాస్ట్ ఫార్వర్డ్‌లో తిప్పినంత వేగంగా గడిచాయి. స్వరూప్ ఆమె మీద అమితమైన ప్రేమ కురిపిస్తున్నాడు. కానుకలు తెస్తున్నాడు. సినిమాలు, షికార్లు తిప్పుతున్నాడు.

ఆమె కూడా అతనితో హుషారుగా మాట్లాడుతోంది. ఏక్టివ్‌గా ఉంటోంది. చైతన్యం అంతా తన ఇంట్లోనే ఉండటంతో ఆమెకి బాల్కనీలోకి వెళ్ళే అవసరమే రాలేదు. స్వరూప్ ప్రేమ ఉప్పెనలో వాహిని ఉక్కిరిబిక్కిరవుతోంది.

ఆ రోజు ఉదయం వాహిని ముగ్గు వేయడానికి ఇంటి తలుపు తెరిచింది. ఎదుటి ఫ్లాట్ తలుపు తీసే ఉంది. నైటీలో ఉన్న ఎదురింటి అమ్మాయి గుమ్మానికి ఎదురుగా కూర్చుని పేపర్ చదువుకుంటోంది. ఎదురింటి తలుపు చప్పుడు విని అటువైపు చూసిన ఆమె వాహినిని చూసి చిరునవ్వు నవ్వింది. వాహిని కూడా నవ్వి ముగ్గు వేసి లోపలకి వెళ్ళిపోయింది. ఆ ముప్పై ఏళ్ళ ఆమె అంటే వాహినికి జాలి. పెళ్ళయింది కానీ భర్త గల్ఫ్‌లో ఏదో దేశంలో ఉంటాడు. అతని ఉద్యోగానికి ఫేమిలీ వీసా ఇవ్వరట. ఆమె ఒక్కతే ఈ ఫ్లాట్‌లో ఉంటుంది. ఇరవై నాలుగ్గంటలు నైటీలోనే ఉంటుంది. ఆ ఇంటి తలుపు పగలంతా తెరిచే ఉంటుంది. వాహినితో స్నేహం చేయాలని ప్రయత్నించింది కాని వాహినిది కొత్త వాళ్ళతో స్నేహం చేసే మనస్తత్వం కాదు.

"ఈ రోజు కొంచెం లేటవుతుంది. ఏడుగంటలకల్లా వచ్చేస్తా. ఏదో కొరియా సినిమా బావుందని చెప్పాడు ఫ్రెండ్ చూద్దాం" ఆమె చెంపమీద చిటిక వేసి వెళ్ళాడు స్వరూప్.

ఆ సాయంత్రం వంట పూర్తి చేసిన వాహిని, స్వరూప్ ఇంకా రాకపోవడంతో బాల్కనీలోకి వెళ్ళి చూసింది. పార్కింగ్‌లో అతని బైక్ కనిపించింది. 'వచ్చేసారే' అనుకుంటూ తలుపు తీసి లిఫ్ట్ వైపు చూసింది. అది ఇంకా పైకి రాలేదు.

తలుపు మూస్తూ ఎదురింటివైపు చూసి ఆశ్చర్యపోయింది. ఆ ఇంటి తలుపు మూసివుంది. దానిముందు స్వరూప్ షూస్!

వాహినికి తలుపు ఎలా వేసిందో గుర్తులేదు. తడబడుతూ వెళ్ళి సోఫాలో కూలబడింది. భర్త దూరంగా ఉన్న ఆకలి చూపుల ఎదురింటి అమ్మాయి. భార్య బోర్ కొట్టిన స్వరూప్!

వీళ్ళిద్దరికీ ఎలా పరిచయమైంది? అది ఎప్పుడు పడకగది దాకా వెళ్ళింది?

తను పిచ్చిదానిలా జీవితం మారిపోయింది అని సంతోషపడుతోంది. తనకి చేసే ద్రోహానికి ప్రాయశ్చిత్తంగా స్వరూప్ తనమీద అధిక ప్రేమ, కానుకలు కురిపిస్తున్నారు. అంతేకాని అతను తనని నిజంగా ప్రేమించడంలేదు.

ఎదురింటి అమ్మాయి భర్త దగ్గరకి వెళ్ళిపోతే ఆ ప్రేమకి ఫుల్ స్టాప్ పడచ్చు. అది అపరాధభావన. నిజానికది ప్రేమ కాదు. నష్టపరిహారం. తన ప్రమేయం లేకుండానే తన జీవితంలో చైతన్యం ప్రవేశించింది. కొన్నాళ్ళకి అది వెళ్ళిపోతుంది. తన ప్రమేయం లేకుండానే. వాహినికి దుఃఖం పొంగుకు వచ్చింది.

బెల్ మోగింది. కళ్ళు తుడుచుకుని లేచి తలుపు తెరిచింది.

"హాయ్ డార్లింగ్! వచ్చేసా" స్వరూప్ ఉత్సాహంగా అరుస్తూ ఆమె బుగ్గ మీద ముద్దుపెట్టుకున్నాడు.

వాహిని ఎదురింటివైపు చూసింది. తలుపు తీసివుంది. నైటీలోని ఆ అమ్మాయి చిరునవ్వుతో చూస్తోంది.

"భగవాన్! నాకా స్తబ్ధత రోజులే కావాలి. ఈ కృత్రిమ ప్రేమని భరించలేను. నటించలేను ఎదురించలేను. ఈ సంబంధం నాకు తెలుసని తెలిస్తే స్వరూప్ విచ్చలవిడిగా ప్రవర్తించవచ్చు. ఈ భయంతో ఉంటేనే నయం. కానీ మరొకర్ని తాకిన దేహాన్ని, మరొకర్ని ఇష్టపడిన హృదయాన్ని భరించలేను. నాకో పరిష్కారం చూపించు"

ఆమె మౌనంగా దేవుడ్ని వేడుకుంది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments